

# లోకం పోకడ

రచన: — "నీరా" —

'అవునే! కామాక్షి విన్నావటే ఈ విడ్డూరం! ఎంత ఘోరం! అవ్వ! మన మెప్పుడైనా కని విని ఎరిగేమా?' ప్రారంభించింది కాఫీగుండ కనిపోయిన కామాక్షమ్మతో తాయారమ్మ.

'ఆ! అలాగా! ఏం జరిగింది' ఎవరి మీద పిడుగు పడబోతుందో ఊహించు కోలేక పోయింది.

'ఏం జరిగిందంటా వేమిటమ్మా అవల కొంప లంటు కుంటుంటేనూ అందులో మీ యింటి ప్రక్క జరుగుతున్న నాటకం నీకు తెలియదా?'

'అయ్యో! నాకేం తెలియదమ్మా' గత్యంతరం లేక సంభాషణలోకి దిగింది అయిష్టంగానే యింట్లో కాఫీ కనిపెట్టిన నీరు మరగిపోతుంటే భర్త కనిపెట్టుకొనుండగా.

'శివ శివా! నేను నోటితో చెప్పలేను. అచ్చంగా ఆ వీరబ్రహ్మం చెప్పినట్టుగానే జరుగుతూంది.'

'కొంచం కాఫీ గుండ దీంట్లో బదులివ్వండి. ఈ వేళ గింజలు తెచ్చి దంచి ఇచ్చి వేస్తాను.'

'ఎంత కలికాలమైనా మన వీధిలో యిటువంటి నీచము జరుగకూడదుస్మీ'

'ఆయన ఆఫీసుకు పోవాలి. కాఫీ కోసం కాచుకొనున్నారు. నిన్న నే చెప్పడం మరచిపోయాను.'

'అయ్యోరామ! ఇంకా కాఫీ ఎలా సయిస్తుందీ? ఆ యింటి ప్రక్కే ఉన్నారాయె. మన యింటా వంటా ఎప్పుడైనా, ఇంత అన్యాయమా?'

'ఇంతకీ ఏంజరిగిందోచెప్పరేమండీ?' చికాకుతో ప్రశ్నించింది.

అది కనిపెట్టి ఇక ఉపన్యాసం పొడిగింప యిష్టం లేక 'జరగవలసిన దేదో జరిగింది. చెప్తే ప్రాయశ్చిత్తం చేయగలవా ఏంటి? పరాయి మొగాడితో అనసూయ ఏంటమ్మా ఆ పకపకలు వికవికలు. మన మంతా పెద్దవాళ్ల మయాక ఏమైనా వీధి మొఖం చూసామా? పెళ్లికాని పిల్ల! ఎంత అణకువ వినయంగా వుండాలి ఐనా ఏదో సంబంధం స్థిరపరచి దాన్ని పెళ్లి చేసేయక అలా వుంచివేస్తా రేమిటీ?'

'అయ్యయ్యో మీ సంగతే మరచి పోయాను. రామీ ఈవిడకు దీనిలో కాఫీ గుండ యివ్వు'

తయారమ్మ డాక్టరు రామనాధం భార్య. ఆయనకు స్వంతంగా ఒకహాస్పిటలు వుంది. రెండతస్థుల భవనంలో క్రిందహాస్పిటలు; పైన వారుంటున్నారు. ఎటువంటి రోగమైనా వారి మందుతో యిట్టే పారి పోతుందని ప్రతీతి. ఒక కంపౌండరు, నర్సు. ఆయా అక్కడ పని చేస్తున్నారు. జీతం ఏబై రూపాయలైనా రాజారావు వేరే ఉద్యోగ ప్రయత్నం లేక ఈ ఆసుపత్రిలోనె అయిదు సంవత్సరాలై కంపౌండరుగా వున్నాడు. వయస్సు ముప్పై. అందమైన ఆకారం. దానికి తోడు ఎప్పుడూ చిరునవ్వుతో ఉంటాడు. జల్సారాయుడు. చీకూ చింతా లేని బ్రతుకు. జీతమేకాక లోపాయకారిగా వేరే సంపాదిస్తున్నట్టు వినికిడి. ఏమైనా రామనాథం ఇతనిని పూర్తిగా విశ్వసించాడు. రాజారావు కూడ వినయ విధేయతలతో నుంటాడు. ఎప్పుడింటి కెళ్లాడోగాని ఎప్పుడూ హాస్పిటలులోనె కనుపిస్తాడు. వేరే డ్రయివరు లేనందున డాక్టరు స్వయంగా కారు నడుపుకుంటాడు. తను పనిలో నున్నప్పుడు యింట్లో వారికి కావాలంటే రాజారావు కారు నడుపుతాడు.

ఆ వూరిలోనే కాక చుట్టు ప్రక్కల చాలా గ్రామాల వారితనినే పిలుస్తారు. రోగం నయమయిన ఈయన్ని పొగుడుతారు. ప్రాణం పోయిన ఆయుర్దాయం పూర్తి అయిందంటారు. డబ్బు ఎక్కువ పుచ్చుకున్నా వాని హస్తం చల్లనిది. కీర్తితోబాటు ఆయన ధనం పెరుగుతున్నాది. పగలల్లా హాస్పిటల్‌లోను పై వూరులోను గడపినా రాత్రి 12 గం॥ వరకు వైద్య గ్రంధాలు చదువుతునే వుంటాడు. లైబ్రరీకని ప్రత్యేకించిన గదిలోకిపోయి దీక్షతో చదువుతూ బాహ్య ప్రపంచాన్నే మరచి పోతుంటాడు.

కామాక్షమ్మతోనే గాక వచ్చిన వారం దరితోను తాయారమ్మ ఆ విధంగా చెప్పింది. వారి వీధిలో జరగే అనాచారాన్ని అరికట్టాలని హెచ్చరించింది. ఏమీ లేనిదే వూరికే తాయారమ్మ ఎందుకు కల్పిస్తుంది. ఐనా ఈకాలం పిల్లలు మరీ బరి తెగించి పోతునారు.

అనసూయ సెటిల్‌మెంటు ఆఫీసు గుమస్తా కేశవరావు చెల్లెలు. వచ్చే జీతం భార్యా బిడ్డల పోషణకే చాలకపోతె చెల్లెలు పెళ్లి ఎలా జరిపిస్తాడు? తల్లి దండ్రులు పోయాక అనసూయను పెంచే భారం ఒక యిల్లాలిని చేయవలసిన భారం తన నెత్తినపడింది. సంబంధాలకోసం గాలించాడు. ఒకటా రెండా అనేకం. కాని కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటే తమ గౌరవం మంటగలసి పోతుందని కాబోలు ససేమిరా అన్నారు. తల్లి తండ్రిలేని పిల్ల ముద్దు ముచ్చట తీరదన్నారు పెద్దలు. కళ్యాణయోగముంటే అదే జరుగుతా దన్నారు వేదాంతులు. డాక్టరుగారి మేడలో ఒక వాటాలో అద్దెకున్నాడు కేశవరావు. అద్దె కోసం కాక పోయినా ఆ వూర్లో యిల్లు దొరక్క పోవటంలో కేశవరావుకు చిన్న వాటా యిచ్చారు; నెలకు పదిహేను రూపాయలు పుచ్చుకుంటూ.

రివెన్యూ ఇనస్పెక్టరు మూర్తి ఆ వూరు వచ్చినది లగాయతు వాని భార్య

లతకు అనసూయకు అమిత స్నేహం. ఎవరో క్రొత్తవారు ఆ వీథిలో దిగారని అనసూయ వెళ్లి లతతో పరిచయం చేసికొన్నది. లతకు ఆ వూరు క్రొత్త దానికితోడు భర్త తరచుగా క్యాంపులకు పోతుంటాడు. అందుకని లత అనసూయలు గంటల తరబడి కబుర్లతో కాలము గడపేవారు. అనసూయకు ఇంట్లో అట్టే పని ఉండేది గాదు. కనుక ఎప్పుడూ లతతోనె గడపేది. ఎప్పుడు సినిమాకు వెళ్లినా యిద్దరుకలసే. సమవయస్కులవటంవల్ల వారి స్నేహం వృద్ధి కాజొచ్చింది. యింటి పనులు ఎక్కువగా ఉండటం వలన లత అనసూయ యింటికి ఎప్పుడో కాని వెళ్లేది కాదు. వారి స్నేహం కొందరికి ఈర్ష్య కల్గించింది గూడ. కాని ఏం చేయగలరు? తమ మేడలో అద్దెకున్న అనసూయ వద్దకు వచ్చికూడ తమ దగ్గరకు రాలేదని లతపై ఒకింతకోపం తాయారమ్మకు. గర్విష్ఠి అని చిన్నా పెద్దా ఎంచదని చెప్పటంకూడ కద్దు.

ఇండియన్ మెడికల్‌బోర్డు వార్షిక సమావేశానికి రామనాథంగారు ఢిల్లీ వెళ్ళారు. అయన సూచనల ప్రకారం రాజారావు రోగులకుమందులిస్తున్నాడు. రోగ లక్షణాలను వారి వారి షీట్లలో కెక్కించు సరికి సాయంత్రమైంది. యింతలో 'అమ్మగారు సినిమాకు వెళ్తారట కారు నడుపుటకు రావాలి' రామి కబురు తెచ్చింది.

ఆ వేళ పౌర్ణిమ. పిండార బోసినట్టు వెన్నెల కాస్తోంది. ఒక కారు సందు మలుపు తిరిగి మెయిన్ రోడ్డు గుండా పోతుంది. వెనుక సీట్లో తాయారమ్మ చందమామ అందం చూస్తు దీర్ఘముగా ఆలోచిస్తుంది. తన పెళ్లి ప్రయత్నాలకు తండ్రి చాల శ్రమ పడ్డాడు. తనకేం కావలసిన డబ్బు వుంది. ఎన్ని వేలయినా క్రుమ్మరించి తగిన వరుణ్ణి తేవచ్చు. కాని వివాహమంటే భావి సౌభాగ్యానికి పునాదిరాయి అని; అతి నేర్పుతో దానిని చేయాలని చెప్పేవారు. తుదకీ సంబంధాన్ని స్థిరపరచారు. కట్న రూపంగా అయిదు వేలిచ్చినా యితర లాంఛనాలని మరి మూడువేలు రాబట్టారు. ఆ డబ్బు మదుపుపెట్టి ప్రయివేటు ప్రాక్టీసు పెట్టారు. ఎన్నో వేలు సంపాదించారు. మమ్ము చూచి నాన్నగారు తృప్తిచెందుతారు. తన శ్రమ ఫలించినందుకు సంతోషిస్తారు. కాని...కాని తనకు గల బాధ ఎవరికి తెలుసు. ఒకరికి చెప్పుకో లేనిది. నిజంగా స్త్రీ నైతికంగా దిగజారి పోవడానికి పురుషుడే కారకుడు. 'అమ్మగారు దిగండి. హాలు వచ్చేసింది' అనే మాటలకు త్రుళ్లిపడి కారు దిగింది తాయారు.



శ్రీకృష్ణా థియేటరు మెర్క్యురీ లైట్లతో దేదీప్యమానంగా వెలిగిపోతుంది. కౌంటరులవద్ద జనం కిటకిటలాడుతున్నారు. రాజారావు తెచ్చిన టికట్టు పుచ్చుకొని లోనికిపోయి కూర్చున్న తరువాత యిందాకటి ఆలోచనలు మళ్లీ ప్రారంభం. అతి కష్టంమీద దృష్టి సినిమాకు మళ్లించింది.

అది నాయకీ నాయకుల ప్రేమ ఘట్టం. పూదోటలో పండు వెన్నెల్లో లేడిలా గెంతులేస్తూ పాడు తున్నారు.

'రాధ నేను కృష్ణుడ వీవె
రమ్యమైన శారద రాత్రి
రాస లీల వేళ యిదే......'.

మృదు మధురంగా, వీనుల విందుగా హాయి హాయిగా వారి రాగాలాపనలో కరగిపోయింది మిసెస్ రామనాథం. శబ్ద తరంగాలు అలవోకగా చెవిని జొచ్చి కాదుకాదు నఖశిఖ పర్యంతం శరీరాన్నంతా ఆక్రమించి మధురానుభూతిని కల్గిస్తున్నాయి. తన్మయం చెంది గాలిలో తేలిపోయి సుదూర తీరాలకు పయనించింది. ఆమె కన్నులు అర్ధ నిమీలితాలు. శరీరం పులకాంకురం.

ప్రేక్షకులు గుంపులు గుంపులుగా సినిమానుండి వస్తున్నారు. చిత్రముపై వారి అభిప్రాయం ఎవరికి తోచినట్టు వారు చెప్పుకుంటూ. ఆడవాళ్ల గేటు వద్ద పురుషులు నిలచి తమ స్త్రీలు

రాగానే కలసి వెళ్తున్నారు. ఊరికే కొందరచ్చట నిల్చొని వచ్చిన ఆడవాళ్ల నందరినీ పరకాయించి చూస్తున్నారు. తాయారమ్మ ఎక్కగానే కారు స్టార్టు చేసాడు రాజారావు. రకరకాలైన వేషాలతో పోతున్నారు జంటలు. షార్క్‌ఖిన్ బుష్‌కోటు, గేబర్డీన్ ఫాంటు, క్రేపు చెపుల్స్ ప్రక్కన రెండు జడలు, ఆర్గండీ వాయిల్ బ్లౌజు, ఆకాశం రంగు నైలాన్ చీరె. బాలుని ప్రక్క బాలిక. మధ్య వయస్కుని చెంత ప్రౌఢ, వృద్ధునితో అమ్మమ్మ ఇంకా ... ఇంకా గంతుకు తగిన బొంత. ప్రకృతి అంతా జంటలుగానె వుంది. ప్రకృతి పురుషుల లక్షణం దృగ్గోచరం అవుతూంది. అసలు జంటలేనిదే సృష్టిలేదు. ద్వాదశ రాసులలోగూడ మూడవది మిథునం. వేడి నిట్టూర్పు విడచింది తాయారమ్మ. అమెలో ఊహలు కారుచక్రాలమల్లే గిఱ్ఱున తిరుగుతున్నాయి.

అదేరాత్రి మంచముపై అటు నిటు దొర్లింది అనసూయ. ఎంతకీ నిదుర పట్టదు. తనెంత కాలమిలా అన్నగారికి బరువై ఉండటం? భూమిపై ఆడపుట్టువుకు పూర్వజన్మ పాపం కారణమా? ధనికులు ఎంత కట్నాలయినా యివ్వగలరు. పామరులలో పరవాలేదు. మాధ్యమికుల గతేంకాను? ఇప్పటికి ఎన్ని సంబంధాలు కట్నంలేదని తప్పిపోలేదు. పోనీ తన్ను చదివించినా బాగుండేది. అన్నపై ఆధారపడక ఏదో ఉద్యోగం చేసును.

ఉక్కగా వుండుటచే బయటకు వచ్చింది. గాలి అవలప్రక్క బాగా వీస్తుంది. అటువైపుగా వెళ్లింది. చివరకు పోయి ప్రక్కకు తిరిగి నిశ్చేష్టురాలైంది. తను చూచినది కలా? లేక యదార్థమా? ఏదో తప్పు చేసినట్టు భావించి గిరుక్కున తిరిగి వచ్చినత్రోవ పట్టింది. గాబరాతో పోతున్నపుడు చేయి తగిలి పిట్టగోడపైని పూలకుండీ అరుగుపై బడింది.

అప్పటికి గాని తాయారమ్మ రాజారావులకు తెలివిరాలేదు. అంతవరకు ప్రకృతి సౌందర్యం తోడుపడ ఏదో లోకాల్లో స్వైరవిహారం చేస్తూన్నారు. దబ్బుమనే శబ్దంతో అనంతలోకాలలోనుండి ఈ లోకంలో పడ్డారు. ఇంకేముంది! కొంపమునిగింది. ఇంత కాలముగా తమకున్న గౌరవ ప్రతిష్ఠలు మంటగలసిపోతాయి. ఆ వీధిలో ఇంక జీవించగలదా? కంగారుగా రాజారావు మెట్లుదిగిపోయాడు.

ఆరాత్రి తాయారమ్మకు నరాలన్నీ పీకుతున్నాయి. తన ఆనందానికి పానకంలో పుడకలాగ ఎక్కడ దాపురించింది. రాత్రంతా దుర్భరవేదనతో గడపాలా? అంత రాత్రప్పుడు అనసూయ ఎందుకు అక్కడకు వచ్చినట్టు? కొంపతీసి ఎవడినైనా ప్రియుణ్ణి మెట్లమీదుగా రమ్మని చెప్పిందేమో? ఈసంగతి ఎవరితోనైనా చెపుతుందేమో! బరువుగా నిట్టూర్చింది. ఆ వీధిలోనెగాక చుట్టుపక్కల అనసూయకు చాలమంది స్నేహితురాండ్రు. లతకు అనసూయకు మధ్య రహస్యమంటూ లేదు. దీనికేదైనా విరుగుడు కనిపెట్టాలి. తన మాటంటే వీధిలో చాలమందికి గౌరవము దీర్ఘంగా ఆలోచించింది. ఐతే ఆలోచన మెరుపులా తట్టింది.

ఆ ఉదయమే కాఫీగుండకు వచ్చిన కామాక్షమ్మతో నాందీ ప్రస్తావన పలికింది. ఇంకేముంది ఈవిషయం కాస్త వీధంతా పాక్కింది. నలుగురు నాలుగు రకాలుచా చెప్పకున్నారు. 'నిప్పులేందే పొగరాదు' ఒకరు ఉవాచ. 'తాయారమ్మ ఊరికే చెపుతుందా? ఏదో అత్యాచారం జరిగుండాలి. వేరొకరి భావము. తాయారమ్మ ప్రవర్తన అనుమానించిన నూటిలో నొకరు మా కెందుకులే అని ఊరుకున్నారు పదిమంది కెదురు చెప్పలేక.

ఈ గాలిదుమారానికి అనసూయ ఎండుటాకులా తల్లడిల్లిపోయింది. తిండి సయించలేదు. ఏడుస్తూనే రాత్రులు చాల భాగం గడపేది. అన్న వదినెలు ఆమెను ఓదార్చలేకపోయారు. దుష్టులకు దూరంగావుంటే మంచిదని వారం రోజులలోనే రెండు వీధులావల వేరొక యింటికి పోయారు. వారు ఖాళీచేసిన భాగము రాజారావు ఆక్రమించాడు. ఆసుపత్రికి దూరంగా వుంటే ఎప్పటికప్పుడు రావడం కష్టం, శని విరగడైనట్టు భావించుకొని తాయారు ఎప్పటివలె భర్త గ్రామాంతరాలలో ఉన్నపుడు రాజారావుని లాలిస్తూభర్త యింట్లోవున్నపుడుమాత్రం మహాపతివ్రతయై వానికి సపర్యలుచేస్తు గడుపుతున్నాది. ఆమె గౌరవం యిసుమంతైనా తగ్గలేదు. ఆమె ఆదర్శగృహిణి. మహిళలకు మార్గదర్శకురాలు. దూరంగా పోయినా అనసూయలో బాధమట్టుకు పోలేదు. లతామూర్తులుకూడ అంతే! అప్రతిష్ఠ కలగటమేకాక ఆత్మీయురాలు దూరమైంది. ఇటువంటి నిర్భాగ్యులు లోకంలో ఇంకా ఎంతమంది వున్నారో? విడివడని సంఘపు ఉక్కుసంకెళ్లలో ఇటువంటి సంఘటనలు కలిగిన బందీలు ఎంతమందో? లెఖా? జమా? ★

